ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
ఆదివారం 21 ఏప్రిల్ 2024





పొంచి ఉన్న తాగునీటి ముప్పు

- శ్రీరాంసాగర్‌లో తగ్గిన నీటి మట్టం
- ప్రాజెక్టులో ప్రస్తుతం 10.613 టీఎంసీల నీరు నిల్వ
- మిషన్ భగీరథ సరఫరాకు ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించిన అధికారులు

సాధారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 90 టీఎంసీలుగా ఉంటుంది. ప్రస్తుతం డ్యామ్‌లో 10.613 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. గత యేడాదితో పోలిస్తే సగానికి సగం నీటి నిల్వ తగ్గింది. ఒకవేళ 10 టీఎంసీలకు ఇంకా తగ్గితే బురద నీరు వస్తుందని సంబంధిత వర్గా లు అంటున్నాయి. ఫలితంగా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలకు కష్టాలు ఎదురుకానున్నాయి. నిన్న మొన్నటి వరకు 10.613 టీ ఎంసీల నీటిలో కొంత రైతుల కోసం పంట చేలకు చివరి తడి కింద అందించడంతో రోజు రోజుకూ నీటి మట్టం తగ్గింది. కాకతీయ కాలువ, లక్ష్మీ కాలువ, సరస్వతీ కాలువల నుంచి రోజుకు సుమారు 6 వేల క్యూసెక్కుల వరకు నీరు చేలకు ఇచ్చారు. నీటి మట్టం ఇంకా తగ్గితే ముందు తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం ఎస్సారెస్పీలో ఉన్న నీటి నిల్వ ...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 90.3 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 10.613 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి 20.388 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వల్ల 1,447 క్యూసెక్కుల నీరు డ్యామ్‌లోకి వస్తోంది. నిన్న మొన్నటి వరకు చివరి తడి కింద మూడు కాలువల ద్వారా రోజుకు సుమారు 6 వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం సాగుకు నీటి సరఫరాను నిలిపివేశారు. సరస్వతీ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రతీ రోజు 291 క్యూసెక్కుల నీరు ఎండ వేడిమికి ఆవిరి అయిపోతోంది. మిషన్ భగీరథ కింద తాగునీటి అవసరాలకు ప్రతీ నిత్యం 231 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గ ప్రాంతాలకు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు 107 క్యూసెక్కుల నీటిని మిషన్ భగీరథ అవసరాల కోసం వదులుతున్నారు.

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వర ప్రదాయినిగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నీటి మట్టం గణనీయంగా పడిపోతోంది. నీటి ఎద్దడిపై పొలిటికల్ వార్ కొనసాగుతోంది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ విధానాల కారణంగానే నీటి సమస్య ఏర్పడుతుందని బీఆర్ఎస్ చెబుతుంటే.. లేదు లేదు గత ప్రభుత్వం తప్పిదం కారణంగా ఇప్పుడు కష్టాలు ఎదుర వుతున్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ రెండు పార్టీలు నీటిపై రాజకీయం చేయడం తగదని బీజేపీ నేతలు అంటున్నారు. మొత్తానికి ఇప్పుడు రాజకీయం మొత్తం నీటి చుట్టే తిరుగుతోంది. జగిత్యాల జిల్లా కు సాగు, తాగు నీరు అందించడంలో ప్రధానంగా ఉన్నటువంటి ఎస్సారెస్పీ నీటి మట్టం తగ్గడంతో ముప్పుందు నీటి ఎద్దడి పొంచి ఉంది. అంతే కాకుండా కాలువల చివరి ఆయకట్టు ప్రాంతాలు, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు అంటున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరి పంట కోతలు పూర్తవుతున్నాయి. ఇదే సమయంలో తీవ్రమైన ఎండలు కొనసాగు తున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. జిల్లాను ఆనుకొని ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుతుండడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాలోని పలు నివాసిత ప్రాంతాల్లో నీటి కష్టాలు మొదలు కానున్నాయ ని ఆందోళన చెందుతున్నారు.

గతంలో మాదిరిగానే...

మిషన్ భగీరథ పథకం ప్రారంభమైన ఏడాదికే ఎస్సారెస్పీలో నీటి మట్టం తగ్గడంతో ఆ సమయంలో ఆందోళనకు దారితీసింది. 2019 సంవత్స రంలో ఎస్సారెస్పీలో జేసీబీతో పూడిక తీయాల్సి వచ్చింది. డెడ్ స్టోరేజీ నుంచి నీళ్లను వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. డెడ్ స్టోరేజీ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా ఎత్తి పోసి ప్రజల దాహార్తిని తీర్చారు. అప్పట్లో రెండు, మూడు రోజుల కోమారు నీటిని అందించారు. ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృత్తమవుతుందనే ఆందోళన అధి కార వర్గాల్లో, ప్రజల్లో నెలకొంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం...

జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగునీరు ఇక్కట్లు ఎదురుకాకుండా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించింది. భూగర్భ జలాలు తగ్గినా, ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గినప్పటికీ ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా ఉండడానికి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర నేతృత్వంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు బోరింగ్‌లను రిపేర్ చేయించడం, హ్యాండ్ బోర్‌లను సైతం ఉపయోగంలోకి తీసుకొని రావడం వంటివి చేశారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లను తవ్వడం, మంచినీటి పథకాలకు నీటిని అందించడం వంటివాటిపై చర్యలు తీసుకుంటున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి వంటి పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎదురుకా కుండా ఉండడానికి సమీప ప్రాంతాల్లోని రైతులకు చెందిన వ్యవసాయ బోర్లను సైతం అద్దెకు తీసుకోవడానికి సమాయత్తం అవుతున్నారు.

తాగునీటి సమస్యలు రానివ్వం

దివాకర, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్



జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగు నీటి సమస్య ఎదురుకాకుండా ఉండ డానికి ముందస్తు చర్యలు తీసుకుం టున్నాము. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాము. పలు బోరింగ్‌లను ఇప్పటికే మరమ్మతు చేయించడం, కొత్త బోరింగ్‌ల ఏర్పాటు చేస్తున్నాము. అవసరమైన పక్షంలో వ్యవసాయ బోర్లు, బావులను అద్దెకు తీసుకొని మంచినీటి సరాఫరా చేయడంపై దృష్టి సారించాము. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మిషన్ భగీరథకు శ్రీరాంసాగర్ నీరే దిక్కు...

ప్రతి ఒక్కరికి మిషన్ భగీరథ నీరు అందించేందుకు శ్రీరాంసాగర్ ప్రా జెక్టు నీటిని వినియోగించేలా పథకం రూపొందించారు. ఇందుకోసం జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం డబ్బ గ్రామం సమీపంలో ఇన్‌టేక్ వెల్, మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించారు. కాకతీయ కాలువ ద్వారా సేకరించిన శ్రీరాంసాగర్ నీటిని డబ్బ ప్రాంతంలో నిర్మించిన పిల్టర్ బెడ్-వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, రాయికల్ తదితర పట్టణాలతో పాటు జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, చొప్పదండి, వేములవాడ నియోజక వర్గాల్లోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా కోరుట్ల నియోజకవర్గంలోని 97 గ్రామాలకు, జగిత్యాల నియోజక వర్గంలోని 133 గ్రామాలకు మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి సెగ్మెంట్‌లలో 386 ఆవాసాలు, వేములవాడ, చొప్పదండి సెగ్మెంట్‌ల పరిధిలోని 101 ఆవాసాలకు నీరు సరఫరా అవుతోంది. జిల్లాలో 921 వాటర్ ట్యాంక్‌లు, 3,248 కిలోమీటర్ల పైప్ లైన్ల ద్వారా సుమారు 2,66,105 ఇంటింటి నల్లాల కనెక్షన్లకు మిషన్ భగీరథ నీరు అందిస్తున్నారు.

కొండగట్టులో హనుమాన్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు

- రేపటి నుంచి మూడు రోజుల పాటు..



కొండగట్టు ఆలయం

7లో..

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు డీఎం నింజే



మాట్లాడుతున్న కలెక్టర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరి శీలకులు డీఎం నింజే అన్నారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కార్యాలయంలో జరుగుతున్న ఎన్నికల పనులను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాతో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడారు. మోడల్ కోడ్‌ను అమలు చేయాలని సూచించారు. జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధు సుదన్, ఆనంద్ కుమార్, ఎక్సయిజ్ సూపరెండెంట్ సత్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ మినహాయించాలి

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న టెట్‌కు మినహాయింపును ఇవ్వాలని ఎన్‌సీటీ ఈ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ యోగేశ్ సింగ్‌ను జిల్లాకు చెందిన పలువురు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. శనివారం న్యూ ఢిల్లీలో ఎన్‌సీటీఈ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ యోగేశ్ సింగ్‌ను సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత రావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు జన్మదిన వేడుకలు

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను శనివారం జగిత్యాలలో తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు నాయుడు 75వ జన్మదినం పురస్కరించుకొని కేకును కట్ చేసి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీటీడీపీ నాయకులు కొండ శ్రీధర్, సోమ నారాయణ రెడ్డి, ఓరుగంటి బార్గవ్ రామ్, బత్తుల కొండయ్య, మారంపల్లి సాయిలు, తిరుపతి, జలందర్ రెడ్డి, గాజుల నాగరాజు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నేత ఉప్పుల రామకిష్టయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. గుండారపు రాజశేఖర్, తిరుమన్‌దాసు శ్రీనివాస్, కిషన్, కోస్న ప్ర భాకర్‌రెడ్డి, గంగారం పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్ : పట్టణంతో పాటు మండలంలోని నాగులపేట గ్రామంలో శనివారం ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ రాష్ట్ర నాయకుడు మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కోరుట్ల పట్టణంలోని అంజనేయ స్వామి దేవాలయం పత్ర్యేక పూజలను నిర్వహించిన నాయకులు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అదే విధంగా మండలంలోని నాగులపేట గ్రామంలో కేక్ కట్టు చేసి వేడుకలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో టీడీ పీ నాయకులు రాజు, గణేష్, మహాదేవ్, అంజయ్య, షేక్ నజీర్, గంగులు, మోహిత, చిలివేరి మలేశ్వరి, జ్యోతి, శాంతలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిది ఏబీవీపీ బ్యాక్‌గ్రౌండ్

- లోపల హిందుత్వం ఉన్నా.. ఏమీ చేయలేని స్థితిలో సీఎం
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి ఏబీవీపీ బ్యాక్ గ్రౌండ్ ఉందని, లోపల హిందుత్వం ఉన్నా బయట ఏమీ చేయలని పరిస్థితిలో ఆయన ఉన్నారని, ఒక హిందువుకు మేలు చేయలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కరెక్ట్ కాదని, ఆయన అందులో ఉంటే సరిగా పనిచేయరన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని, భారత జాతిని ఏ రకంగా అవమాన పరిచిందో, ఓటు బ్యాంకు రాజకీయాలకు దేశాన్ని ఎలా విభజన చేసిందో ప్రజలకు తెలుసునన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్‌కు రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. 1975లో రాజ్యాంగంలో సెక్యులర్ పదాన్ని తెచ్చి పెట్టింది కాంగ్రెస్ అని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పంట ఉత్పత్తులకు రూ. 500 బోనస్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కరప్షన్‌కు అడ్డ.. కమిషన్ల గడ్డ అని ఆరోపించారు. 370 ఆర్టికల్ రద్దు చేస్తామని, త్రిబుల్ తలాక్ వాపస్ తీసుకొని వస్తామని, బంగ్లాదేశ్ రోహ్యంగాలకు పౌరసత్వం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు అంటుండడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీ అమలు ఏమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు ఎందుకు విచారణ జరపడం లేదన్నారు. కాళేశ్వరం కేసును సీబీఐ స్వీకరించి సరైన విచారణ చేస్తేనే నిజానిజాలు బయటపడుతాయన్నారు. కాళేశ్వరం అక్రమాలపై సరియైన విచారణ చేయకుండా ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. తన రాజకీయ డీఎన్ఏపై బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు విమర్శించడం విడ్డూరంగా ఉందని, ఏబీవీపీలో గతంలో పనిచేసిన నేపథ్యం తన తండ్రి ధర్మపురి శ్రీనివాస్‌కు ఉందని వివరించారు. గడిచిన ఐదేళ్ల కాలంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని, పసుపు బోర్డు ఏర్పాటు, రైల్వే లైన్ల అభివృద్ధి తదితర పనులు చేశామన్నారు. నిజాం దక్కన్ షుగర్ కర్మాగారాల పునరుద్ధరణకు సైతం కృషిని చేస్తున్నామన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటనుందని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రధానీ నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సాధిస్తారన్న ధీమాను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు రంగు గోపాల్, నాయకులు పడాల తిరుపతి, ఆముద రాజు, కొక్కు గంగాధర్, ఒడ్నాల మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్

●ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో పలు వార్డులకు చెందిన సుమారు రెండు వందల మంది కార్యకర్తలు, నాయకులకు అర్వింద్ కండువాలను కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు పెద్ద బోగస్

ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు పెద్ద బోగస్ అని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. శనివారం చొప్పదండి నియోజకవర్గానికి చెందిన నాయకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీలిచ్చిన ఆరు గ్యారెంటీలే పెద్ద బోగస్ అని, మోసాలు చేయడంలో కేసీఆర్‌ను కాంగ్రెస్ నేతలు మించి పోయారన్నారు. వరికి క్వింటాల్‌కు 500 రూపాయలు ఇవ్వలేని కాంగ్రెస్ పార్టీ 30 వేల కోట్ల రుణమాఫీ చేస్తుందంటే ఎలా నమ్ముతారని ప్రశ్నించారు.

● కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువు

కాంగ్రెస్‌ను చూస్తే జాలేస్తోందని, ఆ పార్టీకి అభ్యర్థులే కరువయ్యా రన్నారు. కాంగ్రెస్ కూటమికి ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పే ధైర్యం కూడా లేదని ఎద్దేవా చేశారు. వానలతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ గతంలో ఇచ్చిన హామీ మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా వడ్లను కొనడానికి 700 కోట్లు ఖర్చు చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులను ఆదుకునేందుకు ఆ నిధులను సైతం సమకూర్చలేని ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానంటే రైతులెవరూ నమ్మడం లేదన్నారు. జీతాలు, అప్పులు చెల్లించడానికి నెల నెలా 11 వేల కోట్లను సమకూర్చలేక అపసోపాలు పడుతున్నారన్నారు.

● బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు

దేశం అభివృద్ధి చెందాలంటే. పేదల బతుకులు బాగు పడాలంటే మోదీయే ప్రధానిగా ఉండాలని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. కరీంనగర్‌లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. బీజే పీలోకి వస్తున్న నాయకులకు మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని నమ్మి ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నమ్మక ద్రోహం చేసిందన్నారు.

● కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు

జిల్లాలో ఏ క్షణం వర్షం పడుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇతర జిల్లాల్లో వానలు పడి ఇప్పటికే వరి ధాన్యం తడిసిపోయిందన్నారు. ఇప్పటికే రైతులకు తాలు, తరుగుతేమ పేరుతో క్వింటాలుకు ఐదు కిలోల చొప్పున రైతులు నష్టపోతున్నారన్నారు. వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు కేంద్రాల వద్ద సరైన సౌకర్యాలు లేవన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఇచ్చిన మాట ప్రకారం బోనస్ ఇచ్చి వరిని కొంటారా లేదా అని ప్రశ్నించారు.

● ఎవరు పునరావాసం పొందారో ఆలోచించాలి

ఎమ్మెల్యేగా ఓడిపోయిన బండి సంజయ్ ఎంపీగా పోటీ చేయడానికి కరీంనగర్ పునరావాస కేంద్రమా అంటూ వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ అనడానికి సిగ్గుండాలన్నారు. నిజామాబాద్ ఎంపీగా ఓడిన కవితకు ఎమ్మెల్సీ, కరీంనగర్‌లో ఓడిన వినోద్‌కుమార్‌కు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యేగా ఓడిన కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. ఇది పునరావాసం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు జరుగుతున్నది లోకల్‌కు నాన్ లోకల్‌కు పోటీ అని తెలిపారు. ప్రభుత్వాన్ని కూల్చాలనే ఉద్దేశం బీజేపీకి లేదని, గతంలో బీఆర్ఎస్ నుంచి, ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. పదవులకు రాజీనామా చేస్తేనే బీజేపీలో చేర్చుకుం టామన్నారు. గతంలో ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి పదవులకు రాజీనామా చేసాకే బీజేపీలో చేరారన్నారు.



బీజేపీలో చేరిన చొప్పదండి నియోజకవర్గ నాయకులతో బండి సంజయ్‌కుమార్

● రెండో స్థానం కోసమే బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ

పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లకు 17 సీట్లు బీజేపీ గెలువబోతున్నదన్నారు. కరీంనగర్‌లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కలిసి పని చేస్తూ డబ్బులు వెదజల్లుతున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు రెండో స్థానం కోసమే పోటీ పడుతున్నారన్నారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచే అవకాశాలే లేవన్నారు. ఆ పార్టీకి డిపాజిట్ కూడా రాదన్నాన్నారు. దేశంలో 400 స్థానాలు గెలుచుకుని మోదీ నాయకత్వంలో మూడో సారి కేంద్రంలో అధికారం చేజిక్కించుకుంటామన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనాడైనా ప్రజా సమస్యలపై కొట్లాడారా, కాంగ్రెస్ మంత్రి ఏనాడైనా ఉద్యమాలు చేశారా అని ప్రశ్నించారు. ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసి, 109 కేసులు పెట్టినా భయపడకుండా కేసీఆర్‌ను గద్దెదించే దాకా పోరాటం చేశామన్నారు. హిందూగాళ్లు, బొందుగాళ్లని హేళన చేసిన కేసీఆర్ చెంప చెళ్లు మనిపించిన చరిత్ర కరీంనగర్ ప్రజలదన్నారు. కాంగ్రెస్ పార్టీ పీఎఫ్ఐ లాంటి ఉగ్రవాద సంస్థలను పెంచి పోషిస్తుంటే వారికి వ్యతిరేకంగా కొట్లాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. దేశంలో, రాష్ట్రంలో గుంటనక్కలన్నీ ఏకమైనా బీజేపీ అధికారం

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: మహారాష్ట్రలోని దాదర్‌లో ఆదివారం నుంచి 24వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి మినీ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేష్ బాధ్యులు జిట్టవేని శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 14న హ్యాండ్‌బాల్ అసోసియేషన్(హాయ్) నిర్వహించిన మినీ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి టి కారుణ్య, బసరవేని చరణ్‌తేజ, జిట్టవేని సుశాంత్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని జిల్లా పెట అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, యూనుస్‌పాష, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, అశోక్, రాజ్‌కుమార్, భాస్కర్, రాజేందర్, ఐతరవేని శ్రీనివాస్, అనూప్‌రెడ్డి అభినందించారు.

ఎండల తీవ్రతకు చేపలు మృతి

- రూ. 4లక్షల నష్టం వాటిల్లిందని మత్స్యకారుల ఆవేదన - అధికారులు ఆదుకోవాలని వినతి

ఇల్లందకుంట, ఏప్రిల్ 20: ఎండల తీవ్రతకు మండలంలోని టేకుర్తి గ్రామ ముప్పారం చెరువులో చేపలు మృతి చెందాయి. నాలుగు రోజులుగా దంచి కొడుతున్న ఎండ వేడిమికి సుమారు రెండు టన్నుల చేపలు మృతి చెందాయని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది 2లక్షల పిల్లలు 4లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసి చెరువులో వేశారు. చేపలు కూడా 2కేజీల నుంచి 3కేజీల సైజ్ వరకు పెరిగాయని మత్స్యకారులు చెప్పారు. ఏప్రిల్ మొదటి నుంచి ఎండ తీవ్రత పెరిగింది. దీంతో చెరువులో నీరు క్రమంగా తగ్గింది. చెరువు కింద వరి సాగు చేసన్తున్న కొందరు రైతులు రాత్రి వేళ తూము తీయడం వల్ల నీరు బయటకు వెళ్లింది. చెరువులో నీరు పూర్తిస్థాయిలో తగ్గడంతోనే ఎండ తీవ్రతకు చేపలు మృతి చెందాయని, అధికారులు తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.


ముప్పారం చెరువులో మృతి చెందిన చేపలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పాక సురేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్ శివారులోని మానేరు వంతెనపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధిపేట జిల్లా తోగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన పాక సురేష్ అలియాస్ సూరజ్ (26) దుర్మరణం చెందాడని ఒకటో రాణా పోలీసులు తెలిపారు. బంధువుల ఇంటికి కరీంనగర్‌కు వచ్చి సురేష్ శుక్రవా రం రాత్రి 10 గంటల సమయంలో సిద్ధిపే టకు వెళుతుండగా మానేరు వంతెనపై తన బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన సురేష్ తలకు తీవ్ర గాయా లతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు పాక జైబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గంగాధర, ఏప్రిల్ 20: గంగాధర మండలం మధురానగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి 13 తులాల బంగారం, 4లక్షలు ఎత్తుకెళ్లారు. ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్నాల ప్రశాంత్ తన కుటుంబంతో కలిసి శుక్రవారం రాత్రి కొడిమ్యాల మండలంలో శుభకార్యానికి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి చేరుకున్నాడు. తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోని బీరువాను తెరిచి చూశారు. అందులోని సుమారు 13 తులాల బంగారం, 20 తులాల వెండి, 4లక్షల ఆరువేలు కనిపిం చలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి దొంగతనం చేశారని. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

రామడుగు, ఏప్రిల్ 20: మండలంలోని గుండి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గోపాల్‌రావుపేట్ గ్రామానికి చెందిన జానపద డప్పు కళాకారుడు ఏగోలపు మల్లేశ్ (54). అతడి భార్య భారతమ్మ (42) బైక్‌పై కరీంనగర్ వైపు వెళుతున్నారు. ఆ సమయంలో కరీంనగర్ నుంచి గోపాల్‌రావుపేట్‌కు వెళుతున్న లారీ గుండి గ్రామం వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యా భర్తలకు తీవ్రగాలయ్యాయి. స్థానికులు గమనించి కరీంనగర్‌కు తరలించారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20: రామగుండం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలో నాటుసారా తరలిస్తున్న గుగులోతు కిషన్‌నాయక్ అబ్కారీ సిబ్బందికి పట్టుబడ్డాడు. శనివారం న్యూమారేడుపాక చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా అల్లూరు తండా వైపు నుంచి బైక్‌పై నాటుసారా తరలిస్తున్న కిషన్‌నాయక్‌ను ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. కిషన్‌నాయక్ వద్ద నుంచి నాలుగు లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాటు సారా అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మంగమ్మ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్స్ ఖాదిర్, ప్రసాద్, శ్రావణ్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 750గ్రాముల గంజాయి పట్టివేత, ఇద్దరి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: గోదావరిఖని కాకతీయనగర్‌లోని గంజాయి స్థావరంపై శనివారం రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఒక ఇంట్లో తనిఖీ జరిపి 750గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయనగర్‌కు చెందిన క్యాటరింగ్ పనిచేసే బీరవేని అభిలాష్(21), హనుమాన్‌నగర్‌కు చెందిన డెలివరీ బాయ్ గంగ్రేటి కార్తీక్(21)లను అరెస్టు చేశారు. అనంతరం వారిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

కుక్కను కాపాడబోయి..
విద్యుదాఘాతంతో వివాహిత మృతి

మెట్‌పల్లి, ఏప్రిల్, 20: కుక్కకు విద్యుత్ వైరు తగిలి కొట్టుకుంటుండగా దానిని కాపాడే ప్రయత్నంలో ఓ వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఉంటున్న పల్లపు పద్మ(29)కు భర్త తులసీరాం, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శనివారం సాయంత్రం పద్మ ఇంటి ముందు కూర్చుని ఉంది. అదే సమయంలో ఇంటి ముందున్న విద్యుత్ వైరు తెగి కుక్కపై పడటంతో విద్యుత్ షాక్‌తో అది కొట్టుకుంటోంది. దీనిని గమనించిన పద్మ వెంటనే అక్కడకు వెళ్లి కాపాడే ప్రయత్నం చేయగా విద్యుత్ తీగ తగిలి షాక్ కొట్టడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి మృతితో చిన్నారుల రోదనలు మిన్నంటాయి.

పేకాట రాయుళ్ల అరెస్టు

● 18 మంది నుంచి రూ.1.51లక్షలు స్వాధీనం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని అయిలాపూర్ అనుబంధ గ్రామమైన కిషన్‌రావుపల్లె శివారులోని ఓ ఫాం హౌస్‌లో పేకాట ఆడుతున్న వారిని కోరుట్ల, మెట్‌పల్లి ఎస్ఐలు కిరణ్‌కుమార్, చిరంజీవి వారి సిబ్బందితో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. ఫాం హౌస్‌లో 18 మంది పేకాట ఆడుతున్న వారిని గుర్తించి అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. వారి వద్ద రూ.1.51లక్షల నగదుతో పాటు 18 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. భారీ ఎత్తున పేకాటరాయుళ్ల అరెస్టు కావడంతో మండలంలో చర్చనీయాశంగా మారింది.

● **గంభీరావుపేట:** మండల కేంద్రంలోని నమాజ్ చెరువు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు నమాజ్ చెరువు ప్రాంతంలో గాలించగా ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని ఎస్ఐ రాంమోహన్ పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. 3 వేల 50 రూపాయలు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎవరైనా మానసిక ఆందోళన, ఒత్తిడికి గురైతే వారికి ఫోన్‌లో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. టెలీమానస్ పేరుతో 14416 నంబరులో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మానసిక వైద్యుడి సలహాలు, సూచనలు ఉచితంగా అందచేస్తారని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురైన వారిని లక్షణాల ద్వారా గుర్తించి మానసిక వైద్య నిపుణుల దగ్గరికి తీసుకెళ్లాలని సూచించారు. చికాకు పడడం, ఆసక్తి కోల్పోవడం, నిద్రలేమి, అపరాధ భావన, నిరాశావాదం, నిస్సహాయత, ఆత్మహత్య చేసుకోవాలని అనిపించడం, ఒంటరిగా ఉండాలనుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు భావించాలన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈ వేసవిలో నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల కోచ్‌లనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పది కేంద్రాలలో మే 1నుంచి 31వరకు వివిధ క్రీడాంశాలలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ పూర్తి వివరాలతో ఈ నెల 26 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం, కరీంనగర్ నందు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్. 80083 26913 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్



ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు


ముత్తారం, ఏప్రిల్ 20: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన పులిపాక మహేష్ మానేరు ఇసుకను దొంగతనంగా సీతంపేట గ్రామ శివారులో డంప్ చేసి తరలిస్తుండగా ముత్తారం పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా ఇసుకను డంప్ చేసుకోని అమ్ముకుంటున్నారని సమాచారం మేరకు ముత్తారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూధన్‌రావు తెలిపారు.

గోధూర్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20: మండలంలోని గోధుర్‌లో శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు స్వామి వారిని దర్శించున్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

● కొండగట్టులో రేపటి నుంచి ఉత్సవాలు ● 23న చిన్న హనుమాన్ జయంతి



కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, ఏప్రిల్ 20: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హన్‌మాన్ జయంత్యుత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించే హన్‌మాన్ జయంత్యుత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి దాదాపు మూడు లక్షలకు పైగా దీక్షాపరులు, భక్తులు తరలివస్తుంటారు. దీనికిగాను జయంత్యుత్సవాలకు 41 రోజులు ముందు నుంచే 41, 21, 11 రోజుల దీక్షలను భక్తులు చేపట్టి జయంతి సందర్భంగా విరమణ చేయడం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు.. కొందరు మాలధారణ చేస్తుండగా మరికొందరు స్వామి వారిని దర్శించుకుంటూ మాల విరమణ చేస్తున్నారు.

●ప్రతి ఏటా రెండు ఉత్సవాలు

కొండగట్టులో ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు జరుగుతుంటాయి. చైత్రపౌర్ణమి రోజున చిన్న హన్‌మాన్ జయంతి, తరువాత 41రోజులకు బహుళశుద్ద దశమి సందర్భంగా పెద్ద హన్‌మాన్ జయంతి నిర్వహించడం ఆనవాయితీ. ఒక్కో జయంతి మూడు రోజుల పాటు జరుగనుండగా లక్షలాదిగా హన్‌మాన్ దీక్షాపరులు కొండకు వచ్చి మాలవిరమణ చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకు దేవస్థానంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే చిన్నహన్‌మాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు కొనసాగుతన్నాయి. మంగళవారం చిన్న హనుమాన్ జయంతి ఘనంగా జరుగనుంది.

● కొనసాగుతున్న ఏర్పాట్లు

చిన్న జయంత్యుత్సవాల ఏర్పాట్ల కోసం కలెక్టర్ యస్మిన్ భాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ దేవస్థానం అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల ద్వారా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొండపైన చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోనేరు ప్రాంతం, ఆలయం వెనుకాల కూడా ఏర్పాటు చేయగా ఉత్సవాలకు సంబందించిన స్వాగత తోరణాలు పెట్టారు. వాహనాలలో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటి రోడ్లపై తిప్పులూ భక్తులకు ఎల్లవేళలా నీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వీటితో పాటు లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం కొండపైన సీసీ కెమెరాలు ఇతరత్రా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇంకా కొన్ని పనులు కొనసాగుతూనే ఉండగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. శనివారం నుంచే పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ప్రారంభించారు.

● ఆర్జిత సేవలు రద్దు

ఆదివారం నుంచి 24వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22నుంచి 24వరకు జయంతి ఉత్సవాలు జరుగనుండగా ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజలు ఉండవని భక్తులు సహకరించాలని కోరారు. కాగా జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ భక్తులకు, దీక్షాపరులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

● మొదలైన భక్తుల సందడి

చిన్న జయంతికి ముందే కొండకు హన్‌మాన్ దీక్షపరుల రాక మొదలైంది. శనివారం వందలాదాగా హనుమాన్ దీక్షాపరులు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంజన్న స్వాములతో పాటు భక్తులు కూడా వేలాదిగా తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు.



మాల విరమణ కోసం ఏర్పాట్లు



కొండగట్టు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు



సిద్ధమవుతున్న లడ్డూ ప్రసాదాలు

యువకుడి ఆత్మహత్య

● లోన్ యాప్‌లో రుణం తీసుకుని మనస్థాపం



జయవర్ధన్(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: కుటుంబ సభ్యులకు తెలియకుండా లోన్ యాప్‌లో రుణం తీసుకుని ఆ తరువాత మనస్థాపంతో గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన గాలిపెల్లి జయవర్ధన్ (24) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సింగరేణి కార్మికుడు గాలిపెల్లి తిరుపతికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. చిన్న కుమారుడు జయవర్ధన్ ఐటీఐ చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. జయవర్ధన్ తన ఆర్థిక అవసరాల నిమిత్తం తల్లిదండ్రులకు చెప్పకుండా లోన్‌యాప్ ద్వారా రూ.31వేలు అప్పుగా తీసుకున్నాడు. తరువాత తండ్రి తిరుపతికి తెలిపాడు. తాను డబ్బులు చెల్లిస్తానని తిరుపతి కుమారుడితో పేర్కొన్నాడు. శుక్రవారం రాత్రి 8.30గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలో రేకుల షెడ్డుకు చీరతో ఉరి వేసుకున్నాడు. తల్లి గమనించి ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. జయవర్ధన్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

● విధులపై నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 20: తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు(జీహెచ్‌ఎం, గ్రేడ్-2) పి రాజాభాను చంద్రప్రకాష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(వరంగల్) కె సత్యనారాయణరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజాభాను చంద్రప్రకాష్ ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ కింద కొంత మంది ఉపాధ్యాయుల సెలవు జీతాలు చెల్లింపులకు సంబంధించి 10,07,165 రూపాయలు ట్రెజరీకి జమచేయలేదని, డీడీవోగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. కొందరు ఉపాధ్యాయులు తమకు రావాల్సిన నిధుల విషయంలో నష్టం జరిగిందని, న్యాయం చేయాలని జిల్లా విద్యాశాధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా ప్రధానోపాధ్యాయుడు కూడా తనకు ఆ నిధులకు సంబంధం లేదని, దానికి పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ తిరుమల, ఆమె భర్త రాజ్‌కుమార్ తప్పుడు పత్రాలు సృష్టించి డబ్బులు కాజేసినట్లు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌తో పాటు, జిల్లా విద్యాధికారి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా విద్యాధికారి డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య నేతృత్వంలో ఈ నెల 5న ముగ్గురితో కూడిన కమిటీని నియమించి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై విచారించిన కమిటీ జిల్లా విద్యాధికారికి నివేదిక సమర్పించింది. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సస్పెండ్ అయిన రాజాభాను చంద్రప్రకాష్ తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కావడం గమనార్హం.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు : డీఐఈవో

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20: బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలను కళాశాలలు కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీఐఈవో కార్యాలయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలపై చర్చించారు. ఫలితాలు, ప్రవేశాలకు సంబంధించిన ప్రచారాలను చేసుకునే ముందు విధిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసే వరకు ముందస్తు అడ్మిషన్లను తీసుకోవద్దన్నారు. వేసవి సెలవులను మే 31వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించినందున ఎట్టి పరిస్థితిలో కళాశాలల్లో తరగతులను నిర్వహించవద్దన్నారు. క్వాలిఫై లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని సూచిస్తూ ఇతర నిబంధనలపై కళాశాలల యాజమాన్యాలతో చర్చించారు. సమావేశంలో బాఐఈవో కార్యాలయ పరిపాలనాధికారి సుధాకర్, ప్రైవేట్ కళాశాలల తరుపున మహిపాల్‌రెడ్డి (ఎస్సీజేసీ), మునీందర్ (సాన్వి), అంజిరెడ్డి (రెసొనెన్స్), నాగార్జున్‌రెడ్డి (ఎస్ఆర్), జగన్మోహన్‌రెడ్డి (శ్రీచైతన్య) పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి బాలుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్ విద్యానగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం రెండవ అంతస్తు పైనుంచి కిందపడి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం చంప జిల్లా జంజిగిరికి చెందిన 18 నెలలు వయస్సున్న రాఖీ కుర్రే తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రెండో రాణా పోలీసులు తెలిపారు. విద్యానగర్‌లో భవన నిర్మాణంలో మేస్త్రీగా పనిచేస్తున్న రవికాంత్ శనివారం ఉదయం తన కొడుకుని వెంటతీసుకుని భవనం నిర్మాణం పనులకు వెళ్లాడు. కొడుకును రెండో అంతస్తులో పడుకోబెట్టి అక్కడే పనులు చేస్తున్నాడు. మధ్యాహ్నం భోజన సమయంలో కొడుకు కోసం తండ్రి వెదకగా కనిపించలేదు. కిందకు వెళ్లిచూడగా తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రూ.88.49 లక్షల నగదు పట్టివేత



సీజ్ చేసిన నగదును చూపుతున్న ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్‌లో శనివారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో వేర్వేరు చోట్ల నలుగురు వ్యక్తుల వద్ద రూ. 88 లక్షల 49 వేల నగదు పట్టుబడింది. రాజీవ్ చౌక్‌లో నిర్వహిచిన తనిఖీల్లో అశోక్‌నగర్‌కు చెందిన ఉప్పుల రాఘవాచారి, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సూరజ్ రమేష్‌ల వద్ద 71 లక్షల నగదు పట్టుబడింది. ఒక జ్యువెల్లరీ షాపునకు చెందిన నగదును వీరిద్దరూ బైక్‌పై బ్యాగ్‌లలో తీసుకువెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. నగరంలోని ఐబీ చౌరస్తాలో నిర్వహించిన తనిఖీల్లో అశోక్‌నగర్‌కు చెందిన అంకిత్ తివారి వద్ద 2లక్షల 60 వేల నగదు, ఇందిరాచౌక్ వద్ద తనిఖీలలో సుభాష్‌నగర్‌కు చెందిన దామెర అరుణ్‌కుమార్ వద్ద 14 లక్షల 89 వేల నగదు పట్టుబడింది. ఈ డబ్బులు ఒక ఎలక్ట్రానిక్ షోరూంకు చెందినవిగా సమాచారం. మొత్తం 88 లక్షల 49 వేల రూపాయలు సీజ్ చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. 10 లక్షలపైగా పట్టుబడిన నగదును ఆదాయపు పన్నుశాఖ అధికారులకు, 10లక్షలలోపు నగదును జిల్లా మానిటరింగ్ కమిటీకి స్వాధీనం చేశామని ఏసీపీ తెలిపారు. సంబంధిత నగదుకు సంబంధించిన రశీదులు, ఇతర ఆధారాలు చూపించిన తరువాత నగదును రిలీజ్ చేస్తారని తెలిపారు.

సుల్తానాబాద్‌లో భారీ వర్షం

- తడిసిన ధాన్యం
- కుప్పలను కాపాడుకోవడానికి రైతుల ఇబ్బందులు





సుల్తానాబాద్ శాసితినగర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలు, ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు



కనుకులలోధాన్యంపై వడగళ్లు

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: సుల్తానాబాద్ ప్రాంతంలో శనివారం అరగంట సేపు భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పంటపొలాలు దెబ్బతినడమే కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉన్న కుప్పలు తడిసిపోయాయి. ఉదయం పది గంటల తర్వాత నుంచి ఎండ ఉన్నా ఒక్కసారిగా వర్షం పడ డంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. సుల్తానాబాద్‌పట్టణంలోని మార్కెట్ యార్డులో, శాస్త్రినగర్, కాట్నపల్లి, నర్సయ్యపల్లిలోని కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. ఆయా గ్రామాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న పొలాలు కూడా కొంత మేర దెబ్బతిన్నాయి. గొలుసులతో కూడిన వరి నేలకు రాలింది. అయితే అకాల వర్షం రావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ కుప్పలను కాపాడుకోవడానికి కవర్లను కప్పుకున్నారు. సుల్తానాబాద్, కాట్నపల్లి, నర్సయ్యపల్లి, గర్రెపల్లి, భూపతిపూర్ తదితర గ్రామాల్లో మాత్రమే వర్షం పడింది. అంతకుముందు కనుకుల గ్రామంలో వడగళ్ల వాన పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. కుప్పలు ఆరబోసి ఉంచగా ఒక్కసారిగా వడగళ్ల వాన పడడంతో ధాన్యం దెబ్బతింది. అకాల వర్షంతో రైతులు ధాన్యం తడిసి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి మిల్లర్లు కేంద్రాల నిర్వాహకలు ఎలాంటి కొర్రీలు పెడతారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ మహాలక్ష్మి

గన్నేరువరం, ఏప్రిల్ 20: మండలంలోని గుండ్లపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థిని టి.కారుణ్య జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తెలిపారు. తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మహబూబ్‌నగర్‌లో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అండర్-12 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21నుంచి 24వరకు మహారాష్ట్రలోని దాదర్‌లో జరిగే 17వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొననున్నటు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, పీఈటి జ్యోతి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు హన్మండ్ల భాస్కర్, ఆర్‌సీఓ గౌతంరెడ్డి విద్యార్థిని అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల నిరసన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చల్ల నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన పనులు చేయడానికి సర్పంచులు అప్పులు చేశారన్నారు. ఇప్పుడు అప్పు ఇచ్చిన వారు అడుగుతుండడంతో గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం సర్పంచులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. గతంలో ఇచ్చిన చెక్కులు సైతం తిరిగి వచ్చాయన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహించిన మండలాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో లోక్‌సభ ఎన్నిక లలో పోటీ చేసి నిరసన తెలుపుతామని అన్నారు. మాజీ సర్పంచులు గట్టు మల్లారెడ్డి, బిల్లవేని పర్శరాం, కట్ట వెంకటరెడ్డి, ముస్కు మల్లయ్య, కూనబోయిన భాగ్యలక్ష్మి, కేతిరెడ్డి అనసూయ, మంద సుశీల, మేఘలవ్వ, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీనివాసమూర్తి వైఖరిపై మాజీ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు విన్నవించడానికి వెళ్లగా ఎంపీడీవో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. ప్రజల కోసమే తాము పనిచేశామని, స్వలాభం కోసం చేయలేదని అన్నారు.



నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచులు

తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలి

అదనపు ఎస్పీ వినోద్‌కుమార్



ఓబులాపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న అదనపు ఎస్పీ

మల్లాపూర్, ఏప్రిల్, 20: చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు జిల్లా అదనపు ఎస్పీ వినోద్‌కుమార్ సూచించారు. శనివారం జిల్లా సరిహద్దు మండలంలోని ఓబులాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మెట్‌పల్లి సీఐ నవీన్‌కుమార్, మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్‌లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టులు కీలక పాత్ర వహిస్తాయన్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న చెక్ పోస్టు 24 గంటలు ప్రతి వాహనాన్ని పరిశీలించాలన్నారు. జిల్లాలోకి అక్రమ మార్గంలో ఎలాంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభాలకు గురి చేసే వస్తువులు రాకుండా తనిఖీలను చేపట్టాలన్నారు.

తాగు నీటి సమస్యల పరిష్కారానికి పైపులైన్

మల్లాపూర్, ఏప్రిల్, 20: మండల కేంద్రంలో తాగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు పైపులైను పనులు చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మరిపల్లి మల్లయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మంచి నీటి బావి నుంచి డబుల్ బెడ్ రూమ్‌ల వాసులకు తాగునీటి సరఫరాకు మంజూరైన రూ. 5 లక్షలతో పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లాపూర్ ఒడ్డెర కాలనీలోని డబుల్ బెడ్ రూమ్‌ల వాసులకు తాగడానికి చాలా రోజుల నుంచి మంచి నీరు అందక ఇబ్బందుల పాలైవుతున్నందున పైపులైన్ ద్వారా సరఫరా చేయడానికి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు నూతులపల్లి రాజం, పుంద్ర లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సంజయ్‌కు మద్దతుగా ప్రచారం

మల్యాల, ఏప్రిల్ 20: కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా మండలంలోని మల్యాల, కొండగట్టులో బీజేపీ మహిళా మోర్చా నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మల వివరించారు. ఈ కార్యక్రమంలో సురతాని భాగ్యలక్ష్మీ, సాంబారి కళావతి, చింతకింది అనసూయ, కట్కం లత, అవుదుర్తి రమ, నెరెళ్ల శ్రావణ్‌కుమార్, వెంకటస్వామియాదవ్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : కొడిమ్యాల గ్రామ శివారులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు శనివారం మండల బీజేపీ నాయకులు వెళ్లి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ను ఎంపీగా గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు రాజేశం, రాకేష్, పద్మ, తిరుపతిరెడ్డి, భూమేష్, రాజు, చిరంజీవి, మహేందర్ ఉన్నారు.

ఘనంగా వీరహనుమాన్ విజయయాత్ర



ర్యాలీలో పాల్గొన్న ఆంజనేయ స్వామి దీక్షాపరులు

కోరుట్ల, ఏప్రిల్ 20 : పట్టణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్రను స్వాములు, విశ్వహిందు పరిషత్, ఏబీవీపీ, బీజేవైఎం, బీజేపీ, ఆర్ఎస్ఎస్, వివిధ హిందు ధార్మిక సంఘల వారు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో పూజలను నిర్వహించిన నాయకులను జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆంజనేయ స్వామీ దీక్ష పరులు నృత్యాలు చేస్తూ జైశ్రీరాం నినాదాలతో భక్తి పాటలను పాడారు. ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బారీ బందోబస్తును నిర్వహించారు.

అగ్నిప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలి

మెట్‌పల్లి, ఏప్రిల్, 20: అగ్ని ప్రమాదాలను నివారించడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని మెట్‌పల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి మల్లికార్జున్‌యాదవ్ అన్నారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు శనివారం ముగిసాయి. దీనిలో భాగంగా చివరి రోజు పట్టణంలోని అగ్ని మాపక కేంద్రంలో ఫైర్ నియంత్రణలో ఉపయోగించే వస్తువులు, పరికారులు ప్రదర్శించి ప్రజలు, విద్యార్థులకు వాటి గురించి వివరించారు. అనంతరం కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించి పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అగ్ని మాపక అధికారులు శంకర్, ప్రసాద్, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు నగదు రూపంలో చెల్లించాలి

మేడిపల్లి, ఏప్రిల్ 20: ఉద్యోగ విరమణ ప్రయోజనాలు నగదు రూపంలో చెల్లించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా నాయకులు అమర్‌నాథ్ కోరారు. శనివారం మేడిపల్లి మండలంలోని వల్లంపల్లిలో పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయుడు నరేందర్‌రావు సన్మానం జరిగింది. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న వారికి ప్రయోజనాలు నగదు రూపంలో చెల్లిచాలని బాండ్స్ రూపంలో ఇవ్వాలనుకోవడం ప్రభుత్వ అనాలోచిత చర్య అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు రాజు, ప్రకాశ్‌రెడ్డి, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్ సుందర్, రత్నకర్‌రావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు కూలి పెంచాలి

సమ్మె నోటీస్‌ను ఆర్‌డీవోకు అందించిన కార్మికులు

కోరుట్ల, ఏప్రిల్ 20: పట్టణంలోని వివిధ వాణిజ్య వ్యాపార సంస్థలలో పని చేసే హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆర్‌డీఓకు సీపీఐ, ఏఐటీయూసీ, కార్మిక సంఘ నాయకులు సమ్మె నోటీస్‌ను అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని కార్మికులు కూలీ రేట్లు మాత్రం పెంచలేదన్నారు. వాణిజ్య, వ్యాపార సంస్థల నిర్వాహకులు కూలీ రెట్లు పెంచడానికి సహకారం అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెకు చేపట్టడానికి కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. అరులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇళ్లు కట్టించి పెన్షన్ అందించాలన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘ నాయకులు ఎండీ షరీఫ్, గుడ్ల శ్రీనివాస్, గందం రాములు, గోడుగు కృష్ణయ్య, ద్యాకం సాయిలు, నూనె శంకర్, వల్లజి వెంకటేశ్వర్లు, మాగిరి అబ్బయ్య, విభూది శంకర్, పాల్గొన్నారు.

వివిధ రంగాలకు చెందిన వ్యక్తులకు సన్మానం

రాయికల్, ఏప్రిల్ 20: మండలంలోని గడికోట ప్రాథమిక పాఠశాలలో శనివారం వినూత్న కార్యక్రమాల నిర్వహణలో భాగంగా విద్యార్థులకు పని అనుభవం, శ్రమ విలువ, మానసిక, శారీరక అంశాలు, నైతిక విలువ పెంపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వ్యక్తులకు సన్మానం చేశారు. కరోనా సమయం నుంచి గ్రామంలో అనేక విధాలుగా సేవలు చేస్తూ గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, పీహెచ్‌సీ వైద్యుడు, ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆయాలు, కారోబార్, పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులను ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మినరేందర్ జ్యూట్ బ్యాగులు, శాలువాలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు మౌనిక, గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మపురికి శాశ్వత నీటి పరిష్కారం చూపిస్తా

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 20: ధర్మపురి నియోజకవర్గంలో త్వరలో శాశ్వత నీటి పరిష్కారాన్ని చూపిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ధర్మపురి ప్రజల కోసం ఉచిత మంచి నీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతో వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసిన రాజేష్ అభినందనీయుడని అన్నారు. గత ప్రభుత్వంలో తలాపు గోదావరి నది ఉన్న ఇక్కడి ప్రజలకు నీరు అందించలేదన్నారు. ధర్మపురి ప్రజానీకానికి నీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడానికి కోటి రూపాయలు కలెక్టర్ వద్ద ఉంచామని తెలిపారు. త్వరలోనే ధర్మపురికి శాశ్వత నీటి పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, దినేష్, నర్సాగౌడ్, మురళి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజలకు తెలియజేయాలి

మెట్‌పల్లి రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలయజేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల శ్రీధర్ తన అనుచరులతో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరంచంద్, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిలివేరి దిలీప్, ఉమ్మడి సుధాకర్, చింతల వినోద్, నాయకులు పాల్గొన్నారు.

గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలి

గొల్లపల్లి: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన గడ్డం వంశీకృష్ణకు భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలోని శ్రీ గుండు ఆంజనేయ స్వామి ఆలయంలో ఆయన వంశీకృష్ణతో కలిసి ఆంజన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మన్ కుమార్‌కు, వంశీకృష్ణను స్థానిక పార్టీ శ్రేణులు, ఆంజన్నా దీక్షా స్వాములు స్వాగతం పలికి సన్మానించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గడ్డం వంశీకృష్ణను ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా ఆశీర్వదించాలని కోరుతూ ముడుపులు కట్టారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రెండు దొందుదొందేనన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ లక్ష్మన్ కుమార్ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖల అధ్యక్షులు నిశాంత్ రెడ్డి, దినేష్, శైలేంధర్ రెడ్డి, రాములు గౌడ్, తాజామాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, రాజ్యలక్ష్మీతిరుపతిరెడ్డి, వెంకటేష్‌గౌడ్, శ్రీధర్, ఎంపీటీసీ లంబ ధనవ్వలక్ష్మన్ పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న లక్ష్మణ్ కుమార్, వంశీకృష్ణ

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే దమ్ములేదు

పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే దమ్ములేదని, ఆ పార్టీని బలపరిస్తే ప్రజలు అభివృద్ధిని నిరోధించుకున్నట్లు అవుతుందని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ద్వారానే రాష్ట్రం సాధించిందని, ఆ పార్టీ ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను నిత్యం కాంగ్రెస్ పార్టీ భయభ్రాంతులకు గురి చేస్తోందని, పద్ధతి మార్చుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, వైస్‌చైర్మన్ రామయ్య పాల్గొన్నారు.

ఘనంగా కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు

ధర్మపురిలో కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కొప్పుల ఈశ్వర్ తన సతీమణి స్నేహలతతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి కొప్పుల దంపతులను ఘనంగా ఆశీర్వదించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ అరుణ, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేష్‌కుమార్, మాజీ వైస్‌చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శేఖర్ పాల్గొన్నారు.

గొల్లపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమైందని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. శనివారం గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె, రాపల్లె, లొత్తునూర్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బాగంగా ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని ఓటర్లను ఓటు అభ్యర్థించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినం సందర్భంగా శ్రీరాముల పల్లెలో స్థానిక పార్టీ యువకులు ఆయనచే కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పులకు చిత్ర పటం బహూకరించారు. జడ్పీటీసీ జలేందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ హన్మండ్లు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బాబు, మండల కో-ఆర్డీనేటర్ గంగాధర్, పాల్గొన్నారు.



కొప్పుల ఈశ్వర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

వెల్గటూర్: అమలు కాని ఆరు గ్యారంటీ పథకాల పేరు చెప్పి అబద్ధాల పునాదులపై రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. శనివారం వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి, జగదేవ్‌పేట గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్ దొంగ హామీలను ఒప్పుకున్నట్లే అవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించేలా ప్రతీ ఒక్క కార్యకర్త పని చేయాలని కోరారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినం సందర్భంగా జగదేవ్‌పేట, కుమ్మరిపల్లి గ్రామాలలో స్థానిక నాయకులు కేకు కట్ చేయించి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి లింగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాం చంద్రం గౌడ్, జూపాక కుమార్, మల్లేశం పాల్గొన్నారు.

ముడుపు కట్టిన కొప్పుల ఈశ్వర్



పూజలు నిర్వహిస్తున్న కొప్పుల ఈశ్వర్

మల్యాల, ఏప్రిల్ 20: పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో శనివారం ముడుపు కట్టారు. ఎంపీగా గెలుపు కోసం పూజలు నిర్వహించి కొబ్బరికాయతో ముడుపు కట్టారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు వివిధ పార్టీల అభ్యర్థులు ముడుపు కట్టడం ఆనవాయితీగా వస్తోంది.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, ఏప్రిల్, 20: మెట్‌పల్లి మున్సిపల్ పరిదిలోని ఇంటి యాజమానులు పన్ను చెల్లించి అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మోహన్ సూచించారు. శనివారం పట్టణంలోని పురపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నును ఈనెల 30 లోపు చెల్లించి ఐదుశాతం రాయితీని పొందాలన్నారు. మున్సిపల్ పరిదిలో అందిస్తున్న రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

జగిత్యాల టౌన్, మార్చి 20: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని 37 వార్డులో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పనిచేసే నాయకుడు జీవన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. జగిత్యాలలో పీఎఫ్, పాస్‌పోర్టు కార్యాలయాల ఏర్పాటు జీవన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పిప్పరి అనిత, తవుటు రాంచంద్రం ఉన్నారు.

ధాన్యాన్ని తూకం వేసి కొనుగోలు చేయాలి

కొడిమ్యాల, ఏప్రిల్, 20 : సింగిల్ విండోల ద్వారా, ఐకేపీ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని మండల బీజేపీ నాయకులు అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికి కొన్ని కేంద్రాలలో మ్యాచర్ వచ్చిన ఇప్పటి వరకు తూకం వేయటం లేదన్నారు. తప్ప తాలు, తరుగు పేరిట రైతులను ఇబ్బందుల పాలు చేయవద్దన్నారు. ఆకాశం మేఘా వృతమై ఉన్నందున కాంటాలను పెట్టి రైతులు నష్టపోకుండా సంబందిత అధికారులు చూడాలని కోరారు. మండల బీజేపీ నాయకులు రాజేశం, రాకేష్, తిరుపతిరెడ్డి, పద్మ, సత్యనారాయణ ఉన్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'

రాయికల్, ఏప్రిల్ 20: పేదల అభివృద్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపైనే ఉం దని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. రాయికల్ పట్టణంలో శనివారం గ్రామ, మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అర్వింద్ మా ట్లాడుతూ తాను ప్రజల ఆశీర్వాదంతో ఎంపీగా గెలిచి రైతులకు ఇచ్చిన హామీ మేరకు పనులు చేశానని గుర్తు చేశారు. తాను ఎంపీగా గెలిచాక రెండేళ్లు కరోనా కష్టకాలం వచ్చిందని, అం దుకే గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండ లేక పోయానని చెప్పారు. పార్టీ కార్యకర్తలే బీజే పీ బలం, బలగమని చెబుతూ ఈ ఎన్నికల్లో ఎంపీగా మరోసారి తనను ఆదరించేందుకు పా ర్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలని కోరారు. ఇక నుంచి కార్యకర్తల కష్టసుఖాల్లో ఉంటాన న్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పడాల తిరుపతి, డాక్టర్ బోగ శ్రావణి, పన్నాల తిరుపతిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు అన్నవేణి వేణు, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, ఎంపీటీసీలు మహేష్, మధు పాల్గొన్నారు.

మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి ఎంపీ అర్వింద్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

●రాయికల్ పట్టణంలో శనివారం నిర్వహించిన బీజేపీ సమావేశానికి పిలిచి ఆ పార్టీ శ్రేణులు విలేకరులను అవమానించడం పద్ధతి కాదని మండల ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇచ్చి సమావేశానికి వెళ్లిన పాత్రికేయులను ఇది తమ అంతర్గత సమావేశమని తిప్పి పంపడం ఏంటని ప్రశ్నించారు. ఈ సంఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులను నడపాలి

కోరుట్ల, ఏప్రిల్ 20 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల బస్సులను నడపాలని ఎంవీఐ శ్రీనివాస్ అన్నారు. శనివారం వివిధ ప్రాంతాలలో వాహనాల తనిఖీలో భాగంగా పాఠశాల వాహనాలను పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా వాహనాల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. విద్యార్థుల తరలింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వాహనాల డ్రైవర్ల కు సూచించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలను ఉంచి విద్యార్థులను తరలించాలన్నారు. బస్సులకు ఇన్స్‌రెన్స్, ఫిట్‌నెస్‌లు కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రవాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిచిన ధాన్యం

కథలాపూర్, ఏప్రిల్ 20 : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురవడంతో వరి ధాన్యం తడిచి ముద్దయింది. కథలాపూర్, భూషణరావుపేట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి, సిరికొండ గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిక వర్షం కురవగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పూర్తిగా తడిచిపోయిందని రైతులు వాపోయారు. సుమారు అరగంట సేపు వర్షం రావడం వల్ల కేంద్రాల్లో నీళ్లు నిలిచి ధాన్యం తడిచింది. కొందరు రైతులు టార్పాలిన్ షీట్లు కప్పినప్పటికీ గాలికి ఎగిరిపోయినట్టు రైతులు తెలిపారు. తడిచిన ధాన్యంను కొందరు రైతులు పొద్దంతా ఆరబెట్టే ప్రయత్నం చేశారు. అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేశారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, డబ్బ, వర్షకొండతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం కురిసిన ఆకాల వర్షం రైతులను నిండ ముంచింది. ధాన్యం కోనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడిచి ముద్దయింది. అదే విధంగా పంట పోలలో ఉన్న నువ్వు, వరి పంటలకు అకాల వర్షం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. తడిచిన ధాన్యన్ని ప్రభుత్వమే కోనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేసారు. పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి నష్ట పరిహారం అందించి రైతులను అదుకోవాలని కోరారు.

అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని తడిచిన ధాన్యన్ని ప్రభుత్వమే కోనుగోలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు డిమాండ్ చేసారు. ఆయన శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కోనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యన్ని పరిశీలించారు.ఆయన వెంట నాయకులు నేమూరి సత్యానారయణ, చిన్నారెడ్డి, రంజీత్ ఉన్నారు.



తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

సంక్షిప్త సమాచారం

కథలాపూర్ : మండలంలోని రాజారాం తండాలో శనివారం బీజేపీ శ్రేణులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాల గురించి ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. బోదాసు కమలాకర్, సురిగి వెంకటేశ్, ఆరె శివ, ఉన్నారు.

●నియోజకవర్గ కేంద్రమైన వేములవాడలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా శనివారం కథలాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర‌గౌడ్, ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ సహా వెలిచాల రాజేందర్ రావు నేతృత్వంలో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

మల్లాపూర్ : మండలంలోని రాఘవపేట, గుండంపల్లి గ్రామాల్లో వివిధ కారాణాలతో మృతి చెందిన కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. శనివారం స్థానిక నాయకులతో వారి కుటుంబాలను పరామర్శించారు. ఈయన వెంట సిర్పూర్ మాజీ సర్పంచ్ బాపురెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని అప్పారావుపేట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుడిపెల్లి రాజిరెడి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శనివారం తెలిపారు. రాజీనామా పత్రాన్ని మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌కు అందించారు. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా పత్రంలో పెర్కొన్నారు.

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు డాక్టర్ రాఘవేంద్రరావు తండ్రి చిట్నేని కిషన్‌రావు ఇటీవల మృతి చెందడంతో నిజా మాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పరామర్శించారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో కిషన్‌రావు మృతికి గల కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కిషన్‌రావు చిత్రపటానికి నివాళులర్పించి సంతాపం తెలపారు. అనంతరం డాక్టర్ రాఘవేంద్రరావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కిషన్‌రావు చిత్రపటానికి నివాళులర్పించి సంతపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, ప్రబారి వెంకట రమణి, పట్టణాధ్యక్షుడు రమేష్, గంగాధర్, నరేందర్‌రెడ్డి, మర్రి పోచయ్య పాల్గొన్నారు.

కోరుట్ల: ఎండ తీవ్రత తట్టుకోవడానికి కార్మికులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

●ప్రలోభాలకు అస్కారం ఇవ్వకుండా ప్రతి పౌరుడు ఓటు హక్కు వినయోగించుకోవాలని మున్సిపల్ కమీషనర్ తిరుపతి అన్నారు. శనివారం పట్టణంలోని వివిధ వార్డులలో మెప్మా సిబ్బంది ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలను నిర్వహించి ఇంటింటికి కరపత్రం అందించారు. ఎన్నికల నియమావలి ఉల్లంగించిన వారిపై ఫిర్యాదు చేయడానికి సీ విజిఐఎల్ యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణానికి చెంన జమతుల్ ఉల్మా జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తి మెహల్‌శ్యామ్మి హనుమాన్ దీక్షపరులకు శీతాల పానీయాలు అందజేశారు. కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి హనుమాన్ దీక్షపరులు మెట్‌పల్లి మీదుగా బయలు దేరగా వారికి శనివారం శీతాల పానీయాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాహిద్ ముల్తాప్, ఎండి రైస్‌యోద్దీన్, ఎండి అజారుద్దీన్, పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ సాంఘిక సంక్షేమ గురకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇన్ఫోసిస్‌సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు 50 టాబ్‌లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోళి శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు టాబ్‌లను సద్వినియోగం చేసుకొని కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవా లని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

●జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో హన్‌మాన్ దీక్షపరుల ఆధ్వర్యంలో నిర్వహించిన బిక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం గ్రామంలో పలుకుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జాన్, రాజిరెడ్డి, సత్తిరెడ్డి, రాజిరెడ్డి, నరేష్, రమేష్, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రాజబానుపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యా యుల సంఘం అధ్యక్షుడు పి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంగ నర్సయ్యలు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన ఎల్లెందుల నారాయణ (56) శనివారం అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అజయ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి భక్తులు రూ.లక్ష విరాళం అందజేశారు. కరీంనగర్ భగత్‌నగర్‌కు చెందిన వ్యాసబట్టి విరాట్ మణి వల్లభ్, తల్లి సాయి నిఖిత విరాళంను అన్నదాన విభాగం ఇన్‌చార్జీ రాజేందర్‌రెడ్డికి అందించారు. వారి వెంట అశోక్‌రాజ్ ఉన్నారు.

నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల పరిశీలకులు, వ్యయ పరిశీలకులు శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెగడపల్లి : మండల కేంద్రంలో మాజీ మంత్రి , పెద్దపల్లి పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ జన్మధిన వేడుకలను శనివారం ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాల యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, మాదారపు కరుణాకర్ రావు, తాటిపాముల రాజు,